పది.. భవితకు పునాది

- పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం
- ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలే లక్ష్యం
- నిత్యం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు కృషి



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కలసపాడు : విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి తొలిమెట్టు. వారి బంగారు భవిష్యత్తుకు దశ, దిశ నిర్దేశం చేసేది ఇక్కడే. పదవ తరగతిలో ప్రతిభ కనబరిస్తే బంగారు బాట పడుతుంది. కానీ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అంత సులువు కాదు. దీనిని అధికమించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయలు వినూత్న తరహాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లలో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలంలో ఇలా..

కలసపాడు మండలంలో మొత్తం 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 198 విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

భవిష్యత్తుకు పునాది

విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది పదవ తరగతే. గతంలో పది పరీక్షలకు 11 పేపర్లు ఉండగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఏడు పేపర్లకు కుదించింది. ఒక్కో పేపర్ పరీక్షా సమయం మూడు గంటలు ఉంటుంది. ఇందులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ మాత్రమే గంటన్నర చొప్పున ఉంటుంది. ఆయా సబ్జెక్టులకు మూడు గంటలు సమయం ఉంటుంది.

ప్రత్యేక తరగతులు

పదవ తరగతి విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల పాటు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించి మధ్యాహ్నం 3 గంటలకు ఆ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. అదే విధంగా సాయంత్రం 4–15 గంటల నుండి 5–15 గంటల వరకు గంట పాటు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి ఆయా సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చదువుల్లో చురుకుగా ఉన్న వారు, వెనుకబడిన వారిని గుర్తించి ఇంకా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించాలి

ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగించే విషయాలను చెబుతూ ఉత్తేజపరుస్తున్నారు. ఈ ఏడాది పదికి పది పాయింట్లు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు ముందుగానే చెప్పి ఆసక్తి కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారికి తగిన సలహాలు, సూచనలతో తర్ఫీదు ఇస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యాంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహించి భయాన్ని పోగొడుతున్నారు.

ప్రతిరోజు స్లిప్ టెస్టులు



ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

- బి.తనూజ, పదో తరగతి, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కలసపాడు

సందేహాలు నివృత్తి



పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నాను. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను. పాఠాల్లోని సందేశాలను స్టడీ అవర్స్‌లో నివృత్తి చేసుకుంటున్నాను. కష్టపడి చదివి పది జీపీఏ సాధిస్తా. ఉపాధ్యాయులు పరీక్షలపై భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని నింపుతున్నారు. పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

- ఎస్.కె.అబ్దుల్ రజాక్, పదవ తరగతి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కలసపాడు

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ



పది పరీక్షల్లో విద్యార్థులు పది జీపీఏ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళుతున్నాం. ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా టెస్టులు నిర్వహించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4–15 గంటల నుండి 5–15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మెరుగైన ఫలితాలే లక్ష్యం.

- మెర్సిమాలిని, హెచ్ఎం, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కలసపాడు

మెరుగైన ఫలితాలే లక్ష్యం



మండలంలో 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఈ సంవత్సరం సుమారు 198 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నారు. మార్చి 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గతంలో కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

- ఎస్.మస్తాన్‌వలి, మండల విద్యాశాఖాధికారి, కలసపాడు మండలం

క్లుప్తంగా

ఘనంగా శ్రీరామకృష్ణ జయంతి



శ్రీరామకృష్ణ పరమహంస జయంతి వేడుకలో శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కామనూరు శ్రీరామకృష్ణ సేవా సమితి కేంద్రంలో ఆదివారం శ్రీరామకృష్ణ పరమహంస 190వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీరామకృష్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస కలకత్తా సమీపంలో దక్షిణేశ్వర్ కాళికాలయంలో పూజారిగా చేరి, తన ఆధ్యాత్మిక సాధనలను మరింత పెంపొందించుకున్నారని తెలిపారు. రామకృష్ణ తన ఆధ్యాత్మిక బోధనలకు ఎంతో మంది యువతీ యువకులు ఆకర్షితులయ్యారన్నారు. స్వామి వివేకానంద కూడా ఆయన శిష్యుడేనని పేర్కొన్నారు. ఆయన బోధనలతో ఎంతో మంది ఆధ్యాత్మిక ఉత్తేజితులయ్యారని చెప్పారు. గ్రామంలో స్వామివారిని భజనలు చేస్తూ ఊరేగించారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనరసయ్య, శివనాగిరెడ్డి, శ్రీకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎం రత్నంకు చిత్రపటం బహూకరణ



ఏఎం రత్నంకు చిత్రాన్ని బహూకరిస్తున్న తుపాకుల రామాంజనేయరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు వచ్చిన సినీ నిర్మాత, రచయిత, దర్శకుడు ఏఎం రత్నంకు ఆదివారం సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్టు ప్రోగ్రాం సభ్యులు కలిసి ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా తుపాకుల రామాంజనేయరెడ్డి సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్టు గురించి ఏఎం రత్నంకు వివరించారు. భ్రూణ హత్యలు నివారణకు, బాలికల విద్యకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్టు గౌరవ సలహాదారుడు సాధు పద్మభూషణ్, సభ్యులు నారాయణ, ఆర్టిస్ట్ కుమారి ప్రసన్న పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు భరోసా ఇవ్వని 'కూటమి'

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుద్యోగ యువతకు భరోసా ఇవ్వలేదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని తెలిపారు. ఆదివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, నిరుద్యోగ భృతి, వలంటీర్లకు ఇచ్చిన హామీలకు సంబంధించి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కూటమి నేతలు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో ప్రధాన అంశమైన నిరుద్యోగ భృతి పథకానికి నిధులు కేటాయించకుండా నిరుద్యోగ యువతకు పంగనామాలు పెట్టారన్నారు. అలాగే వలంటీర్లకు రూ.10 వేలు జీతం పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీ సైతం విస్మరించారన్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి నైపుణ్యాభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అర్చక సహ ప్రముఖ్‌గా విజయ్‌భట్టర్

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా మందిర అర్చక పురోహిత సహ ప్రముఖ్‌గా కడప గడ్డిబజారు లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు విజయభట్టర్ నియమితులయ్యారు. నంద్యాల భరతమాత ఆలయ ప్రాంగణంలోని పుల్లారెడ్డి భవనంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత సమావేశంలో ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ఎద్దులాయపల్లె వద్ద 132–33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవిశంకర్ తెలిపారు. దీంతో మల్లేపల్లె, బ్రహ్మంగారిమఠం, టి.చౌదరవారిపల్లె సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదని, అంతరాయానికి వినియోదారులు సహకరించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నరసింహ

బద్వేలు అర్బన్ : కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పగడాల నరసింహను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి ఆదివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయడం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

పకడ్బందీగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

ప్రొద్దుటూరు : ఓపెన్ ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని, జిల్లా అధికారులు ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహించి, పరీక్షల్లో కాపీలు నిర్వహిస్తామని, మీ తరపున వేరే వాళ్లతో రాయిస్తామని చెప్పి విద్యార్థుల నుంచి నిర్వాహకులు డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. అధికారులు ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అనుమతులు లేకుండానే లే అవుట్లు

- వ్యవసాయ భూముల్లో అక్రమ వెంచర్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కొనుగోలు చేసి మోసపోతున్న ప్రజలు



పల్లవోలు సమీపంలో అక్రమ వెంచర్ల నిర్మాణం

చాపాడు : వ్యవసాయ భూముల్లో అక్రమ లేఅవుట్, వెంచర్లు వెలుస్తున్నాయి. భూమి కనిపిస్తే.. అధికార యంత్రాంగంతో పనేముందిలే.. అనే రీతిన రియల్ వ్యాపారులు చకచకా వెంచర్ పనులు చేస్తూ క్రయ విక్రయాలు జరుపుతున్నారు. ఎవరైనా అడ్డు తగిలి ప్రశ్నిస్తే వారిని లోబరుచుకుని పనులు కొనసాగిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

మండల కేంద్రమైన చాపాడు, పల్లవోలు సమీపంలో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరుగుతున్నాయి. చాపాడులో నాలుగైదు చోట్ల లేఅవుట్లు వేసి భూమి విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో పల్లవోలు సమీపంలోని మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున 7 నుంచి 16 ఎకరాలకు పైగా వెంచర్లు వేస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడం లేదు. పంచాయతీ, జిల్లా అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్రహరీ నిర్మించి, విద్యుత్తు స్తంభాలు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలను ఆకర్షిస్తూ వ్యాపారాలు చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పల్లవోలు సమీపంలో అలవంక వద్ద సర్వే నెంబర్ 448/2లో ఒక చోట 4.27 ఎకరాలు, మరో చోట 2.27 ఎకరాలలో పెద్ద ఎత్తున వేంచర్లు వేయగా ఇందులో అలవంకను సైతం ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. దీంతో రైతుల పొలాలకు సాగు నీటి ఇబ్బందులు వస్తాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో నేషనల్ హైవే స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా కల్వర్టు నిర్మించి తమదే అన్నట్లుగా నమ్మించేలా పనులు చేపట్టారు. అధికారుల అనుమతులు లేకుండా పనులన్నీ చకచకా జరిగి పోతున్నా.. చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు స్పందించి స్థలాలను కొనుగోలు చేసే వారు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేతన జీవులను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్



బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవులను పూర్తిగా విస్మరించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు తెలిపారు. బడ్జెట్‌లో వేతన జీవులను విస్మరించడాన్ని నిరసిస్తూ ఆదివారం సుందరయ్య భవనం ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి జీవో ఇవ్వకుండానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాడ్యుటీ అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అలాగే ఆశావర్కర్ల జీతాల పెంపునకు, ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ గురించి ప్రస్తావించలేదన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీ కూడా అతీగతీ లేదన్నారు. కార్మికుల వేతనాల కోసం, సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శ్యాంప్రవీణ్, ఓబులేసు, పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, కో కన్వీనర్ కొండయ్య, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

బద్వేలు అర్బన్ : పట్టణ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత గుండెవ్యాధి వైద్య శిబిరం విజయవంతమైంది. నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డి.సాహెబ్‌పీర్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన 75 మందికి ఈసీజీ పరీక్షలు, 150 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, బి.గురుమూర్తి, ఉపాధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, గౌరవాధ్యక్షులు గానుగపెంటహనుమంతరావు, కొండపల్లిచిన్నసుబ్బారావు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహబూబ్‌సాహెబ్, దాతలు చెన్నకృష్ణారెడ్డి, ఆనంద్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధఃపాతాళానికి చంద్రబాబు

చాపాడు : రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజన్ ఉన్న నేతగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని, రాజకీయాలో పరమావధిగా భావించిన చంద్రబాబు అధఃపాతాళానికి దిగజారిపోయారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్సార్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యంవెంకటసుబ్బారెడ్డి అన్నారు.

విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎలాంటి మేలు చేయవద్దని, రాజకీయాలు మాట్లాడడమే సీఎం చంద్రబాబు విధిగా పెట్టుకున్నారన్నారు. విలువలకు తిలోదకాలిస్తూ రాజకీయాలు కలుషితం చేసి చరిత్రలో నిలిచిపోయారని రెడ్యం మండిపడ్డారు.

సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

అట్లూరు : ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు దృష్టి సారించాలని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్ బాబు తెలిపారు.

స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆదివారం మండలాధ్యక్షురాలు పొత్తపి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు అభివృద్ధి పనుల వివరాలు వివరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌బాషా, మండల విద్యాశాఖ అధికారి విలియం రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, స్థానిక వైద్యాధికారిణి మాధురి, ఏపీఓ జయచంద్ర, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ మానస, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీకి అమ్ముడుపోయిన కౌన్సిలర్ 'పోసా'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : టీడీపీలో చేరిన వైఎస్సార్‌సీపీ 34వ వార్డు కౌన్సిలర్ పోసా వరలక్ష్మి భర్త పోసా భాస్కర్‌కు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రాజకీయ, ప్రాణ బిక్ష పెట్టారని వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తెలిపారు. వైఎస్సార్‌టీయూసీ పట్టణాధ్యక్షుడు ఖాజాపీర్ ఇంటి వద్ద ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన పోసా భాస్కర్, ఆయన సతీమణి వరలక్ష్మి ఇప్పటి వరకు కనీసం వాటర్ బాటిల్ కూడా ఎవరికీ కొనివ్వలేదన్నారు. తొలిసారి వార్డు కౌన్సిలర్ సీట్ జనరల్ కేటగిరికి కేటాయించగా రాచమల్లు అభిమానిగా తెరపైకి వచ్చిన పోసా భాస్కర్ ప్రాధేయపడి టికెట్ ఇప్పించుకున్నారన్నారు. ఆ ఎన్నికల్లో రాచమల్లు పోసాను గెలిపించడానికి రూ.50లక్షలు ఖర్చు చేయడంతోపాటు సమష్టిగా అందరితో పనిచేయించి గెలిపించారని గుర్తుచేశారు. రెండో సారి కౌన్సిలర్ ఎన్నికల్లో ఖాజీపీర్ సతీమణి నామినేషన్ వేయగా వారి కాళ్లు, చేతులు పట్టుకుని విత్ డ్రా చేయించుకున్నారని పేర్కొన్నారు. సమాచారం కూడా ఇవ్వకుండా ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారన్నారు. కౌన్సిలర్ స్థానానికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని పేర్కొన్నారు. రూ.15లక్షలు తీసుకుని టీడీపీలో చేరినట్లు తెలిసిందని తెలిపారు. టీడీపీ నాయకులకు పోసా దంపతులు అమ్ముడుపోయారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ పట్టణాధ్యక్షుడు ఖాజాపీర్, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మన్సూర్ ఇలాహి, చేనేత విభాగం పట్టణాధ్యక్షుడు చౌడం రవిచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 1983-84 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఒకటి కాదు.. రెండు కాదు.. నాలుగు దశాబ్దాల తర్వాత బాల్య స్నేహితులంతా ఒక చోట కలుసుకున్నారు. గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నా పరిచయం చేసుకుని బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, ఆటపాటలతో అలరించారు. ఇందుకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ వైదికైంది. 1983–84 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. 41 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మ్యాథ్స్ టీచర్ గుర్రప్ప, సైన్స్ టీచర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌సీసీ మాస్టర్ నారాయణరెడ్డి, సరస్వతమ్మ, తిరుపతిరెడ్డి తదితర గురువులకు శాలువా, పూలమాలలు వేసి, ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులతోనే తాము ఉన్నత స్థానంలో ఉన్నామని పూర్వ విద్యార్థులు పాదాభివందనం చేశారు. పట్టణంతోపాటు రాష్ట్రం, వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ అపూర్వ సమ్మేళనంలో పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఆర్.ప్రభుకుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు లెక్చరర్ వెంకటరాముడు, పుల్లగూర శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య యాదవ్, అచ్చుకట్ల అబ్దుల్ హమీద్ బాషా, బోలా మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, క్లాస్ 1 కాంట్రాక్టర్ కృష్ణార్జున రెడ్డి, మాజీ ఎస్‌పీఎల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యులను నియమించాలి



నూతనంగా ఎన్నికైన ఆప్తాలమిక్ ఆఫీసర్స్ ఎంప్లాయిస్ అసోయేషన్ రాష్ట్ర కార్యవర్గం

ప్రొద్దుటూరు క్రైం : అంధత్వ లక్ష్య సాధనకు ప్రతి లక్ష జనాభాకు ఒక ఆప్తాలమిక్ ఆఫీసర్‌ను రెగ్యులర్ లేదా కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించాలని పీ ఆప్తాలమిక్ ఆఫీసర్స్ ఎంప్లాయిస్ అసోయేషన్ కేజే రఘురామిరెడ్డి కోరారు. విజయవాడ ఏపీ ఎన్జీఓ హోంలో ఏపీ ఆప్తాలమిక్ ఆఫీసర్స్ ఎంప్లాయిస్ అసోయేషన్ సమావేశంలో అధ్యక్షుడు జి.రెడ్డన్న పర్యవేక్షణలో ఆదివారం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కేజే రఘురామిరెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా, సహ అధ్యక్షుడిగా జీకే మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సప్పటి వసంతరావు, కోశాధికారిగా జి.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ వి.మనీష్ కుమార్, పీవీడీ సుబ్బారావు, రహమత్ ఆలీ ఖాన్, సంయుక్త కార్యదర్శులుగా కె.సత్యనారాయణ, జీవీ రమణ, జి.పద్మజ, సీహెచ్ మాధురి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ఉమామహేశ్వరరావు, ఎ.రఘు, కె.శ్రీనివాస్, ఎడ్విన్ ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సలహా కమిటీ సభ్యులుగా బినా కిశోర్, ఎంఆర్‌కే దాస్, మహేశ్వరి రెడ్డి, కె.చిన్నయ్య, డి.రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్లు ఇప్పటికే 30 నుంచి 39 ఏళ్లు ఒకే కేడార్‌లో ఉన్నారని, వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. జీఓ 143 ప్రకారం ఆప్తాలమిక్ అధికారుల క్యాడర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్స్ ఎంప్లాయిస్ అసోయేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కేజే రఘురామిరెడ్డి ప్రొద్దుటూరు తాలూకా ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు

గోపవరం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్‌డీ హసీనా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో గోపవరం గ్రామ పంచాయతీలోని ఎస్టీకాలనీలో పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి డస్ట్‌బిన్‌లను అందజేస్తూ తడి, పొడి చెత్తను వేరువేరుగా వాటిలో వేసి ప్రతిరోజు ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. అంతేకాకుండా ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలను ప్రతిఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఈఓపీఆర్‌డీ తెలిపారు. సేకరించిన తడి, పొడి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువులను తయారు చేసి అవసరమైన రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రత విషయంపై అధికారులకు సహకరించాలన్నారు. కాలనీలో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.